బీఆర్ఎస్ నుంచి పోతున్నది చెత్త సరుకే

- గట్టి సరుకున్న కార్యకర్తలు కేసీఆర్ వెంటే
- ఎన్నికల తర్వాత రాజకీయ మార్పులు
- కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు: పోచారం



సంగారెడ్డి జిల్లా జోగిపేటలో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం. చిత్రంలో అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

సంగారెడ్డి, మార్చి 29 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ నుంచి చెత్త సరుకుపోతున్నదని, గట్టి సరుకైన కార్యకర్తలు కేసీఆర్ వెన్నంటే ఉన్నారని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పదవులు, వ్యాపారాలు, కాంట్రాక్టుల కోసం బీఆర్ఎస్‌లోని కొంతమంది నేతలు పార్టీ వీడుతున్నారని దుయ్యబట్టారు. పార్టీ వీడుతున్న వారి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజార్టీ సీట్లు గెలిస్తే రాజకీయ మార్పు జరగడం తథ్యమని అన్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత బండ్లు ఓడలు, ఓడలు బండ్లు అవుతాయని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు ఎంపీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీకి ప్రజలను ఓటు అడిగే హక్కులేదని అన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చాలంటే ఏటా రూ.3 లక్షల కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. అన్ని నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం వద్దలేవని అన్నారు. వంద రోజుల్లో 13 హామీలు నెరవేర్చాల్సి ఉండగా అవీ నెరవేర్చలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేశామని గొప్పలు చెబుతున్న రేవంత్ సర్కార్ ఇప్పటివరకు ప్రభుత్వ ఖజానా నుంచి గ్యారెంటీల అమలుకు రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. రైతులు, ప్రజలు, పేదలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. రేవంత్ సర్కారు తీరు ఇప్పుడిప్పుడే ప్రజలకు అర్థం అవుతుందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పాలనపట్ల ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ఇదివరకు జహీరాబాద్ పార్లమెంట్ నుంచి గెలిచిన సురేశ్ షెట్కార్, బీబీ పాటిల్ ఇద్దరూ నియోజక వర్గానికి చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే జహీరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయటంతోపాటు కొత్త రైల్వేలైన్, పరిశ్రమలు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మాట్లాడుతూ మాటతప్పిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చివాతపెట్టడం ఖాయమన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, సాయికుమార్, మీనాక్షి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కుప్పకూలటం ఖాయం

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు భిన్నమైన తీర్పు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కుప్పకూలటం ఖాయమని పోచారం జోస్యం చెప్పారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈడీ, సీబీఐ ఇతర కేంద్ర సంస్థలను అడ్డుపెట్టుకుని బీజేపేతర పార్టీ నాయకులను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. మతరాజకీయాలు చేస్తున్న బీజేపీకి ఎంపీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఓటర్లను కోరారు.

లోకం పోకడ

మన పార్టీలో చేరితే టికెట్లు ఇవ్వండి.. లేదంటే సమస్యలు ఇవ్వండి!

నికార్సైన నాయకత్వాన్ని తయారు చేద్దాం

మూడోపేజీ తరువాయి...

డ్రోహాలు, కుట్రలు, కుతంత్రాలు చేసినా అన్నింటినీ ఛేదించిన ధీరత్వం కేసీఆర్‌ది. అలాంటి ధీరుడిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే రాజకీయ బేహారులకు తెలంగాణ ప్రజలే జవాబు చెప్తారు. ప్రజా ఆశీర్వాదం, మద్దతుతో 14 ఏండ్లు పోరాడి, ఉద్యమ పార్టీగా తెలంగాణ సాధించి, తెచ్చుకున్న తెలంగాణ దశను, దిశను మార్చి, కోట్ల మంది జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని ప్రజలే గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారు' అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికి రోజుకో స్కాం పేరుతో లీకులు ఇస్తూ కాలం గడిపేస్తున్నారని సీఎం రేవంత్‌పై విరుచుకపడ్డారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీని విడిచివెళ్లి ద్రోహం చేసిన మాజీమంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి తిరిగి వస్తామని కేసీఆర్ కాళ్లు మొక్కినా పార్టీలోకి తీసుకోబోమని తేల్చిచెప్పారు. 'రంజిత్‌రెడ్డి పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారు. 2014లో విశ్వేశ్వర్‌రెడ్డిని రాజకీయాల్లోకి తీసుకొచ్చి ఎంపీగా గెలిపించాం. 2019లో కాంగ్రెస్‌లో చేరితే చేవెళ్ల ప్రజల చైతన్యంతో ఓడిపోయారు. ఇప్పుడు రంజిత్‌రెడ్డి కూడా అంతే. కేసీఆర్ కూతురు కవిత అరెస్ట్ అయినరోజు నవ్వుకుంటూ కాంగ్రెస్‌లోకి పోయిన రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డిపై మన పార్టీ కార్యకర్తలు పగ తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. మహేందర్‌రెడ్డి, సునీతామహేందర్‌రెడ్డి పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారు. ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా గుర్తుపట్టలేడు' అని వ్యాఖ్యానించారు.



తెలంగాణ భవన్‌లో చేవెళ్ల ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, కాలె యాదయ్య, అరికెపూడి, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి తదితరులు

నా సవాల్‌పై రేవంత్ స్పందించరేం?

'మల్కాజిగిరిలో పోటీ చేయాలని విసిరిన సవాల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి స్పందించటం లేదు. ఆయన సొంత సిట్టింగ్ ఎంపీ స్థానంలో పోటీకి వెనుకంజ వేస్తున్నారు. సీఎంగా ఉండి ప్రతిపక్షంలో ఉన్నట్టే మాట్లాడుతున్నారు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సర్కారు ఐదేండ్లు అధికారంలో ఉండాలనేదే తమ ఆకాంక్ష అని, తాము కూలగొట్టబోమని స్పష్టం చేశారు. రేవంత్ పక్కన ఉన్న ఖమ్మం, నల్లగొండ బాంబులే కూలగొడతాయని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి బీజేపీకి బీ-టీమ్‌గా మారారని ఆరోపించారు.

ఏ వర్గమూ సంతోషంగా లేదు

'కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా ఉన్నదో చెప్పాలి. రుణమాఫీపై మాట్లాడటం లేదు. ఉచిత కరెంటు కొద్దిమందికే అమలు చేస్తున్నారు. తాగు, సాగునీటికి దిక్కులేదు. కరెంటు సరిగా రాదు. రైతుబంధు పడటం లేదు' అని ప్రభుత్వాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీపై పోరాటం చేయాలంటే కేసీఆర్, మమతాబెనర్జీ, కేజ్రీవాల్‌తోనే సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉండేందు కు ముందుకు వచ్చిన గొప్ప నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ అని కేటీఆర్ అన్నారు. చేవెళ్లలో నిలబడ్డది కాసాని జ్ఞానేశ్వర్ కాదు.. కేసీఆర్ అన్నట్టుగానే పార్టీశ్రేణులు నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 13న జరిగే చేవెళ్ల పార్లమెంట్ మీటింగ్‌కు ప్రతి ఒక్కరు తరలిరావాలని కోరారు.

కార్యకర్తల శక్తిని చూపాలి

నా చిరకాల కోరిక వికారాబాద్ జిల్లా ఏర్పాటు. అది బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చింది. బడుగుల గొంతు పార్లమెంట్‌లో వినిపించాలంటే కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొందాం. చేవెళ్ల, మల్కాజిగిరి రెండు స్థానాల్లో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల మన వాళ్లే.. ఎన్నికల్లో వారు కార్యకర్తల శక్తిని తక్కువ అంచనా వేశారు. ఎన్నికల్లో శక్తిని చూపుదాం.

– సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి

నాయకులే ఆగం అవుతున్నరు..

ఎమ్మెల్యేలు పార్టీలు మారుతున్నారంటూ టీవీలు, పత్రికల్లో ఏవేవో రాస్తున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నాం కాబట్టే కాంగ్రెస్ వాళ్లు ఆహ్వానిస్తున్నారు. తాము బేవకూఫ్ గాళ్లం కాదు.. పోయిన వాళ్లు గడ్డి తిని పోతున్నారు. కష్ట సుఖాల్లో ఉన్నప్పుడు అందరం ఒక్కటై ఉండాలి. ప్రజల్లో బీఆర్ఎస్‌కు బలం ఉంది, నాయకులే సహనం కోల్పోతున్నారు. కేసీఆర్, ప్రభుత్వం మీద వ్యతిరేకత లేదు. స్థానిక నాయకుల వల్ల ఓడిపోయాం. – అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

విలువలతో బతుకుతా..

ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రభుత్వం నిధులు ఇస్తుంది.. వారు అనధికార ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారు. గతంలో నేను ఏదో ఆశించి బీఆర్ఎస్‌లోకి రాలేదు. ఏ ఇతర పార్టీలోకి పోను. కేసీఆర్ దయ వల్ల రెండు సార్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచా. నేను కాంగ్రెస్‌లోకి రానని రంజిత్ రెడ్డికి కూడా చెప్పా.

– కాలె యాదయ్య, ఎమ్మెల్యే చేవెళ్ల

వారు తెలంగాణ ద్రోహులు

కేశవరావు, కడియం శ్రీహరిలు సిగ్గు లజ్జ లేని తెలంగాణ ద్రోహులు. తెలంగాణ అమరవీరుల మీద గన్ పెట్టిన రేవంత్ రెడ్డితో చేతులు కలిపారంటే వారిని ఏమనాలి. ప్రతి ఒక్కరి గుండెల మీద కేసీఆర్ చరిత్ర రాసి ఉన్నది. అది చెరిపివేయలేరు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుంటే రేవంత్ రెడ్డి కూడా సీఎంగా ఉండరు.

– కల్వకుంట్ల సంజయ్ , ఎమ్మెల్యే, కోరుట్ల,

ఇప్పుడు వేరే రాజకీయాలు నడుస్తున్నాయి

పక్కన ఉండి పక్కలో బల్లెం తయారై పార్టీని విడిచిన వారిని చూస్తే చాలా బాధ అనిపిస్తుంది. ఇప్పుడు బ్లాక్ మెయిల్, పోలీస్, ఐటీ, ఈడీ రాజకీయాలు నడుస్తున్నాయి. మనం మాత్రం తెలంగాణలోని ప్రతి కుటుంబం బాగుపడాలని రాజకీయం చేశాం. ప్రజలను బాగు చేసే ఆలోచనలో కాంగ్రెస్ లేదు. మనకు మంచి రోజులు వస్తాయి. – అరికపూడి గాంధీ, ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి

బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు

ఎంపీ మాలోత్ కవిత స్పష్టీకరణ

మహబూబాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : రాజకీయంగా బీఆర్ఎస్ పార్టీని, తనను ఎదుర్కోలేకనే పార్టీ మారుతున్నారంటూ ఇతర పార్టీల నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య పోటీ నుంచి తప్పుకొన్నట్టు ప్రకటన వెలువడిన తర్వాత తాను కూడా వైదొలుగుతున్నట్టు కొందరు పనిగట్టుకొని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 'కొట్లాడటం నా రక్తంలోనే ఉంది. కదన రంగంలో దూసుకెళ్లడమే నాకు అలవాటు. ప్రజా ఆశీర్వాదంతో, బీఆర్ఎస్ కార్యకర్తల బలంతోపాటు గులాబీ దళపతి కేసీఆర్ మార్గదర్శకంతో మానుకోటపై గులాబీ జెండా ఎగరవేస్తా'నని కవిత ధీమా వ్యక్తంచేశారు. ఎంపీ ఎన్నికల నుంచి తప్పుకొంటున్నట్టు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆమె కొట్టిపారేశారు. ఎన్నికల్లో తనపై పోటీ పడేందుకు ధైర్యం లేకనే కొందరు ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆమె విమర్శించారు.

కాంగ్రెస్‌లోకి కడియం వద్దే వద్దు

- శ్రీహరి చేరికను వ్యతిరేకిస్తున్న స్టేషన్‌ఘనపూర్ కార్యకర్తలు
- కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్‌కు మొర

జనగామ, మార్చి 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధపడిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి సొంత నియోజకవర్గం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆ పార్టీ శ్రేణుల నుంచి నిరసన వ్యక్తం అవుతున్నది. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారేందుకు ప్రయత్నిస్తున్న కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర ఆధ్వర్యంలో వివిధ మండలాల ముఖ్యనాయకులు, కార్యకర్తలు శుక్రవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో మొరపెట్టుకున్నారు. నియోజకవర్గంలో పార్టీ వాస్తవ పరిస్థితులతోపాటు గత 30 ఏండ్లుగా శ్రీహరి నియంతృత్వ ధోరణి వల్ల పడిన ఇబ్బందులను ఆమెకు వివరించారు. నియోజకవర్గ కార్యకర్తలకు ఇబ్బంది లేకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారికి అండగా ఉంటూ వస్తున్నానని ఇందిర పేర్కొన్నారు.

కేకే పార్టీని వీడటం సరికాదు

- ఈ వయసులో ఇదేం పని?
- కుటుంబాన్ని చీల్చేలా రేవంత్ కుట్ర
- జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి పదవికి రాజీనామా చేయాలి
- దానం నమ్మదగ్గ వ్యక్తికాదు
- నేను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా
- కేకే కుమారుడు విప్లవ్‌కుమార్

మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు శ్రవణ్, విప్లవ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ కుటుంబాన్ని చీల్చాలని చూస్తున్నారని ఎంపీ కే కేశవరావు కుమారుడు, బీఆర్ఎస్ నేత విప్లవ్‌కుమార్ ఆరోపించారు. కేశవ రావు పదవుల కోసం పార్టీ మారుతారని తాను అనుకోవడంలేదని, ఆయనకు పదవులు కొత్త కాదని చెప్పారు. తన సోదరి, మేయర్ విజయలక్ష్మితోపాటు పార్టీ మారే నేతలు తమ పదవులకు రాజీనామా చేసి వేరే పార్టీలోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. పార్టీ మారే అంశంపై వారు తనతో చర్చించ లేదని తెలిపారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి కేశవరావు బీఆర్ఎస్‌ను వీడటం బాధగా ఉన్నదని చెప్పారు. ఈ వయసులో పార్టీని వీడటం ఏమిటని ప్రశ్నించారు. కష్ట కాలంలో బీఆర్ఎస్‌ను వీడటం సరికాదని, కేసీఆర్‌కు అండదండగా నిలబడి, తిరిగి పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేస్తే బాగుండేదని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా పార్టీ మారే అంశంపై పునరాలోచన చేయాలని కోరారు. తన సోదరి, మేయర్ విజయలక్ష్మిని కార్పొరేటర్‌ను, మేయర్‌ను చేసిందే బీఆర్ఎస్ అని చెప్పారు. ఆత్మగౌరవం ఉన్న వారు పదవికి రాజీనామా చేయాలని సవాల్ చేశారు. దానం నాగేందర్ నమ్మదగిన వ్యక్తి కాదని, ఆయన ఎప్పుడూ ఒకే పార్టీలో ఉండరని వ్యాఖ్యానించారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌ను వీడనని స్పష్టంచేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించనని సీఎంగా ప్రమాణ స్వీకార సమయంలో చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు చేస్తున్నదేమిటని నిలదీశారు.

అధికారం పోగానే ఆత్మగౌరవం గుర్తొచ్చిందా?: శ్రవణ్

అధికారం పోగానే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఆత్మగౌరవం గుర్తుకొచ్చిందా? అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. బార్ ముందు బీడీలు అమ్ముకునేటోడు అని రేవంత్ అనటం ఆత్మగౌరవమా? అని నిలదీశారు. ఏ సామాజిక న్యాయం పాటిస్తున్నారని కాంగ్రెస్‌లోకి వెళ్లారని అడిగారు. కేశవరావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్ తమ పదవులకు రాజీనామా చేసి ఆ పార్టీలోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో మీడియాతో బీఆర్ఎస్ నేతలు కే విప్లవ్‌కుమార్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్తు వైస్‌చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, నారాయణతో కలిసి శ్రవణ్ మాట్లాడారు. దానం నాగేందర్‌కు బీఆర్ఎస్‌లో అన్ని విధాల గౌరవం దక్కిందని తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలు దానంకు తగిన బుద్ధి చెపుతారని అన్నారు. ఆనాడు పార్టీలు మారే ఎమ్మెల్యేపై రాళ్లతో దాడి చేయాలని, ఇంటి వద్ద ధర్నాలు చేయాలని, శవయాత్రలు, ఉరితీయాలని పిలుపునిచ్చిన రేవంత్.. ఇప్పుడేం చేస్తున్నారు? అని ప్రశ్నించారు.

పార్టీని వీడుతున్నది పవర్ బ్రోకర్లే

మూడోపేజీ తరువాయి...

ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీయేనని తెలిపారు. ఈ ప్రాంతానికి కాంగ్రెస్, బీజేపీలు ఏం చేయలేదని చెప్పారు. అధికారం కోసం అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను ఎక్కడికక్కడ నిలదీయాలని, ఆ పార్టీ అబద్ధాలు, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మళ్లీ ఒక్క సారి ప్రజలు మోసపోకూడదని అన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ సర్కారుకు అసెంబ్లీలో చుక్కలు చూపిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్ష నాయకుడిలాగే మాట్లాడుతున్నారని విమర్శించారు. మావవ బాంబులా కాదు, మానవీయంగా ప్రవర్తించాలని సీఎంకు హితవు పలికారు.

శుక్రవారం దుబ్బాకలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న హరీశ్‌రావు

కేసీఆర్ లేని తెలంగాణను ఊహించలేం

'కేసీఆర్ లేని తెలంగాణను ఊహించలేం. ప్రస్తుతం పరీక్షాకాలం. సిద్దిపేట కార్యకర్తలకు ఇది పరీక్ష. నా ఎన్నిక కోసం కార్యకర్తలు ఎంత కష్టపడ్డారో వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కూడా అంతే కష్టపడాలి. నాకు వచ్చినంత మెజారిటీతో ఆయనను గెలిపించాలి. వెంకట్రామిరెడ్డి సిద్దిపేట జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డారు. దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టారు. పేదలకు సాయం చేసే పెద్ద మనసు ఉన్నది. విద్యావంతుడు, కలెక్టర్‌గా పనిచేసిన ఆయనను గెలిపిస్తే ఢిల్లీలో మన గళం బలంగా వినిపిస్తారు. దుబ్బాక, మెదక్‌కు నిధులు తెప్పిస్తారు' అని హరీశ్ చెప్పారు.

కొడంగల్‌కు ఏమైనా తీసుకపో, కానీ..

సిద్దిపేటలో అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకుంటున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. వెటర్నరీ కాలేజీని కొండంగల్‌కి తరలించారని, పనులు జరుగుతున్న దాన్ని ఎలా తరలించుకపోతారని ప్రశ్నించారు. కొడంగల్‌కు ఏమైనా తీసుకపో. కానీ సిద్దిపేటకు వచ్చినవి తీసుకపోతే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. సిద్దిపేట మీద రేవంత్‌కు ఇంత పగ ఎందుకు? సిద్దిపేటపై బీజేపీకి ఎందుకింత ద్వేషం? రఘునందన్ దుబ్బాకకు చేసిందేమిటి? అని ప్రశ్నించారు. 'సిద్దిపేట అభివృద్ధిని చూసి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కండ్లలో నిప్పులు పోసుకుంటున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే బీజేపీ కేసులు పెడుతున్నదని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, కేరళ సీఎం కూతురు మీద కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వాళ్లు దేవుడిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ సోషల్ మీడియాను నమ్మవద్దని ప్రజలు, పార్టీ క్యాడర్‌కు సూచించారు. సమావేశాల్లో పార్టీ మెదక్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి పీ వెంకట్రామిరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ చీడపురుగు కడియం శ్రీహరి

- శ్రీహరిది దళితులను ఎదగకుండా కుట్రలు చేసిన చరిత్ర
- దాస్యం వినయ్ ఆగ్రహం
- శ్రీహరిది దిగజారుడు రాజకీయం
- పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫైర్
- దళిత ద్రోహి : సుధీర్‌కుమార్

హనుమకొండలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్. చిత్రంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పార్టీ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి

వరంగల్, మార్చి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాజకీయాల్లో కడియం శ్రీహరి చీడ పురుగులాంటి వారని, ఆయనకు కనీస నైతికత, నీతి, నిజాయితీ లేదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మండిపడ్డారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం దళిత నాయకులు, కార్యకర్తలను ఎదగకుండా కుట్రలు చేసిన చరిత్ర శ్రీహరికి ఉన్నదని విమర్శించారు. తన బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో పదవులు పొందడమే ఆయన నైజమని దుయ్యబట్టారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ జడ్పీ చైర్మన్ ఎం సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డిలతో కలిసి వినయభాస్కర్ శుక్రవారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కడియం శ్రీహరి కుట్రలు, కుతంత్రాలు చేసి అధిష్ఠానానికి తప్పుడు సమాచారం అందిస్తూ.. నీచమైన రాజకీయాలు చేసిన వ్యక్తి అని విమర్శించారు. కడియం శ్రీహరి టీడీపీలో ఉన్నప్పుడు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడుని బ్లాక్ మెయిల్ చేసి పదవులు అనుభవించారని ఆరోపించారు. కేటీఆర్, తాను, పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలంగాణ కోసం కడియం శ్రీహరిని పార్టీలోకి ఆహ్వానించామని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లోకి రాగానే కడియం స్వార్థానికి దళిత నేతలు విజయరామారావు, రాగమళ్ల పరమేశ్వర్, దొమ్మాటి సాంబయ్య, పసునూరి దయాకర్, అరూరి రమేశ్ రాజకీయంగా బలైపోయారని పేర్కొన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను కాదని బీఆర్ఎస్ కడియం శ్రీహరికి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిందని చెప్పారు. కడియం శ్రీహరి, ఆయన బిడ్డ కడియం కావ్య అభ్యర్థిత్వంపై ఉద్యమకారులు, దళిత సంఘాలు వ్యతిరేకించినా వారిని ఒప్పించి టికెట్ ఖరారు చేశామని తెలిపారు. మార్చి 31న నిర్వహించే వరంగల్ పార్లమెంటరీ సమావేశం గురించి చర్చించేందుకు గురువారం సాయంత్రం తాను కడియం శ్రీహరి ఇంటికి వెళ్లానని, అప్పుడూ పార్టీ మారే విషయం చెప్పలేదని విస్మయం వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రే కాంగ్రెస్ పార్టీతో ప్రత్యేక ప్యాకేజీ మాట్లాడుకొని కడియం, ఆయన బిడ్డ ఓ లేఖను విడుదల చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఏ పార్టీలోకి వెళ్లినా తమకు అభ్యంతరం లేదని వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు.

హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో కడియం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శ్రీహరిది దిగజారుడు రాజకీయం: పెద్ది

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిది దిగజారుడు రాజకీయం అని మాజీ